క్లుప్తంగా

విద్యుత్ ఎస్ఈకి అభినందన



విద్యుత్ ఎస్ఈ ఉమాపతిని అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ఉత్తమ సేవల్లో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలోనే మొదటి స్థానంలో నిలిచిన కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతిని పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అభినందించింది. డిస్కం అధ్యక్షులు టీఎస్ ప్రసాద్, జిల్లా ప్రతినిధులు శనివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో అందరితో పని చేయించి వినియోగదారుల మన్ననలు పొందేలా చూడాలని టీఎస్ ప్రసాద్ కోరారు. అలాగే ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు.

మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలి

కర్నూలు సిటీ: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి తెలిపారు. శనివారం ఆ కాలేజీలో సైకాలజిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటేనే ఏదైనా సాధించగలరన్నారు. చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెందకూడదని సూచించారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జూబేదా బేగం, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 12 నుంచి 14 వరకు నరసరావుపేటలోని పల్నాడు పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల బాలికలకు సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, పద్మాలత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు వాసికి బిజినెస్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విజయభాస్కర్

కర్నూలు(హాస్పిటల్): గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫారం వారు నిర్వహించిన సర్వేలో స్థానిక కర్నూలు వ్యాపారస్తుడు శివపురం విజయభాస్కర్‌కు బిజినెస్ ఔట్ స్టాండింగ్ అవార్డు లభించింది. వ్యవసాయ రైతులకు సంబంధించిన ఫినోలెక్స్ వ్యవసాయ పైప్‌ల వ్యాపారంలో అత్యుత్తమ ప్రతిభకు గాను శనివారం విజయవాడ నోవాటెల్ హోటల్‌లో గవర్నర్ హరి చందన్ బిశ్వభూషణ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.

పోలీసు సిబ్బంది బదిలీ

కర్నూలు: వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు హెడ్ కానిస్టేబుల్, మహిళా ఏఎస్ఐని బదిలీ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా పరమైన సౌలభ్యంతో పాటు రిక్వెస్ట్ బదిలీల్లో భాగంగా ఆరుగురిని బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. కర్నూలు తాలూకా యూపీఎస్‌లో పనిచేస్తున్న ఎస్.ఎ.ఖాద్రిని కర్నూలు ఫోర్త్ టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎం.చెన్నయ్యను ఆదోని టూటౌన్‌కు, అజీజ్ అహ్మద్ ఖాన్‌ను కర్నూలు తాలూకాకు, ఆదోని వన్‌టౌన్‌లో ఉన్న డి.శేఖర్ బాబును కర్నూలు దిశ పీఎస్‌కు, ఉలిందకొండలో పనిచేస్తున్న లక్ష్మీ రామ్‌నాయక్‌ను హాళగుంద పీఎస్‌కు బదిలీ చేశారు. ఆదోని టూటౌన్‌లో పనిచేస్తున్న మహిళా ఏఎస్ఐ ఆదిలక్ష్మిని అటాచ్ విధుల కింద కర్నూలు ఫోర్త్‌టౌన్‌కు నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్, వారసుడు, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, మైఖేల్, వాల్తేరు వీరయ్య, వారసుడు, సువర్ణ సుందరి, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, మైఖేల్, రైటర్ పద్మ భూషన్, బుట్ట బొమ్మ
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, ది ఉమన్ కింగ్, రైటర్ పద్మభూషన్, రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం, బీటీఎస్ యెట్ టు కమ్ ఇన్ సినిమా
భరత్ కాంప్లెక్స్ : రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం, పఠాన్, సువర్ణ సుందరి
రాజ్ : తెగింపు, బుట్ట బొమ్మ
శ్రీరామ: ప్రేమదేశం
విజయ : పఠాన్

విజయానికి సైనికుల్లా పనిచేయాలి

- వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- సంక్షేమ పథకాలు, చేసిన మంచి పనులు ప్రజలకు చెప్పాలని గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు సూచన



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి. చిత్రంలో బీవై రామయ్య



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు

కల్లూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి గృహసారథులు, కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్‌లోని రావూరి గార్డెన్‌లో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్ల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. మూడున్నరేళ్లలో అందించిన పథకాలను, చేసిన మంచి పనులను వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథుల సమన్వయంతో ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షపార్టీలు, వారి అనుకూల మీడియా కలిసి ప్రభుత్వ పథకాలను విస్మరించి అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వాటిని తిప్పి కొట్టి నిజాలను ప్రజలకు తెలపాలన్నారు. టీడీపీ హయాంలో పడిన ఇబ్బందులను, జగనన్న హయాంలో సులభంగా అందుతున్న పథకాలను గుర్తు చేయాలన్నారు. చంద్రబాబు నాయుడు హామీలిచ్చి విస్మరించిన వైనాన్ని, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం నెరవేర్చిన విషయాన్ని ప్రతిఒక్కరికీ వివరించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి, ఆయన విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు, నంద్యాల జెడ్పీటీసీ సభ్యుడు గోకుల్ కృష్ణారెడ్డి, పట్టభద్రుల ఎన్నికల ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యవేక్షకులు కుమారస్వామి రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, సాన శ్రీనివాసులు, మైతాపు నరసింహులు, ఎరుకల వెంకటేశ్వర్లు, సాపురు మాధురి, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి, వార్డు ఇన్‌చార్జ్లు శ్రీధర్‌రెడ్డి, వీరయ్య, బాలచంద్రారెడ్డి, షరీఫ్ పాల్గొన్నారు.

42వ వార్డు కార్పొరేటర్ ఎన్నికకు సన్నద్ధం

- ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో ఖాళీ అయిన 42వ వార్డుకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సన్నద్ధం అవుతోంది. అందులో భాగంగానే శనివారం ఓటర్ల జాబితా సిద్ధం చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. నగరపాలక సంస్థకు 2021 సంవత్సరం మార్చిలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 42వ వార్డుకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కాశిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ఎన్నికయ్యారు. అయితే గతంలో జరిగిన ఓ హత్య కేసులో ముద్దాయిగా ఉన్న ఆయనకు సుప్రీం కోర్టు యావజ్జీవ శిక్ష ఖరారు చేసింది. దీంతో ఆయన జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. ఈ ఎన్నికను రద్దు చేయడంతో తాజాగా మరోసారి ఎన్నికను నిర్వహించాల్సి ఉంది. అందులో భాగంగా ఈ నెల 27వ తేదీ లోపు ఖాళీగా ఉన్న 42వ వార్డులో తాజాగా ఫొటో ఓటర్ల జాబితాతో పాటు ఈ ఏడాది జనవరి 5వ తేదీ కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లను కలుపుకొని జాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ కర్నూలు నగర పాలక సంస్థకు ఆదేశాలు జారీ చేసింది.

నిబంధనల ప్రకారమే స్కానింగ్ సెంటర్లకు అనుమతులు

- జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం ద్వారానే ప్రతి స్కానింగ్ సెంటర్‌కు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు చెప్పారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి మల్టిమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల అనుమతుల విషయంలో నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని, అనుమతులు లేకుండా అల్ట్రాసౌండ్ క్లినిక్స్ ఏర్పాటు చేయకూడదని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. అనుమతులకు సంబంధించి రికార్డుల తనిఖీ పక్కాగా ఉండాలని చెప్పారు. గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతం, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించేలా తరచూ సదస్సులు నిర్వహించాలన్నారు. మార్చి 4న పీసీ పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ కొత్తగా రిజిస్ట్రేషన్ కోసం 14 అల్ట్రాసౌండ్ క్లినిక్స్, రెన్యువల్స్‌కు మూడు క్లినిక్స్ వారు నమోదు చేసుకున్నారని, ఐదు మిషన్లు కొత్తగా వచ్చాయన్నారు. అల్ట్రాసౌండ్ క్లినిక్స్‌లో పనిచేసే ఉద్యోగుల మార్పుకోసం 4 క్లినిక్స్, అల్ట్రాసౌండ్ క్లినిక్ పేరు మార్పు కోసం ఒక్కరు, చిరునామా మార్పు కోసం ఒకరు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి జి. భూపాల్‌రెడ్డి, విజయ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బాలమద్దయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిత్యావసరాలు జాగ్రత్తగా భద్రపర్చాలి

కర్నూలు(రాజ్‌విహార్): అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే నిత్యావసర సరుకులను జాగ్రత్తగా భద్రపర్చాలని స్త్రీ, శిశు సంక్షేమ, సాధికార శాఖ జిల్లాధికారి కేఎల్ఆర్‌కే కుమారి ఆదేశించారు. శనివారం స్థానిక జొహరాపురం రోడ్డులోని గోడౌన్‌ను తనిఖీ చేశారు. అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లు, నాణ్యత, రంగు, శాఖాపరమైన స్టాంపింగ్స్ తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన గుడ్లను తూచి చూశారు. న్యూట్రిషన్ కిట్‌లోని అటుకులు, జొన్నపిండి, రాగిపిండి, వేరుశనగ చిక్కీలు, బెల్లం, ఖర్జూరాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోడౌన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సరుకులు తగిన మోతాదులో సరఫరా చేయాలని సూచించారు. ఈమె వెంట కర్నూలు అర్బన్ సీడీపీఓ అనురాధ ఉన్నారు.



న్యూట్రిషన్ కిట్లను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారిణులు

ఉర్దూ భాషాభివృద్ధికి చర్యలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంలో భాగంగా ఉర్దూ భాషను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్/ సెక్రెటరీ డా.ఎస్ ఆయూబ్ హుస్సేన్ కోరారు. శనివారం ఆయన నగరంలోని ఉర్దూ లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం కింగ్ మార్కెట్ సమీపంలోని ఉర్దూ ఘర్, షాదీఖానాను కూడా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఉర్దూ భాషకు సంబంధించి ఎంతో ఉపయోగకరమైన పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా ఉర్దూ భాషను అభివృద్ధి చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించి తగు కార్యాచరణను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎస్ మహబూబ్‌బాషా, ఉర్దూ అకాడమీ బోర్డు సభ్యులు ఎస్ అబ్దుల్‌షకూర్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ డా.ఎస్ ఆయూబ్ హుస్సేన్

కోల్స్ చర్చి అక్రమాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించా

– కోల్స్ చర్చి సభ్యుడు హావిలన్ బాబు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని కోల్స్ చర్చిలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు కోల్స్ సెంటీనియర్ బాప్టిస్టు చర్చి సభ్యుడు హావిలన్ బాబు వెల్లడించారు. శనివారం సాయంత్రం స్థానిక రాజ్ విహార్ సెంటర్‌లోని ఒక హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చర్చిలో కోశాధికారిగా విధులు నిర్వహించానని చెప్పారు. ఆ సమయంలో చర్చి నిబంధనల మేరకు ఖర్చులు చేస్తూ భక్తులు అందించిన విరాళాలు రూ.4 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అయితే చర్చి కమిటీ అధ్యక్షుడు ప్రభుదాసు, కార్యదర్శి అనిల్ నాథ్, కోశాధికారి చార్లెస్, మాజీ కోశాధికారి అబ్షలోమ్ రాజులు అక్రమాలకు పాల్పడి నిధులు తప్పుదారి పట్టించారని ఆరోపించారు. వారు చేసిన అక్రమాల గురించి మాట్లాడితే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు కర్నూలు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారన్నారు.

జాతీయ సదస్సులో కర్నూలు వైద్యుడు

కర్నూలు(హాస్పిటల్): న్యూఢిల్లీ వేదికగా ఈనెల 2వ తేదీ నుంచి జరుగుతున్న యురాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా కాన్ఫరెన్స్‌లో కర్నూలుకు చెందిన యువ యురాలజిస్ట్ డాక్టర్ సేపూరి బాలరవితేజ పలు ప్రసంగాలతో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. 56వ జాతీయ సదస్సుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సీనియర్ యురాలజిస్టులే గాక పీజీ వైద్య విద్యార్థులు సైతం హాజరయ్యారు. సీనియర్ వైద్యుల్లో అతి పిన్న వయస్కునిగా డాక్టర్ బాలరవితేజ 2, 4వ తేదీల్లో యురాలజి, క్యాన్సర్ చికిత్సలకు సంబంధించిన పలు సబ్జెక్టులపై పేపర్, పోస్టర్, వీడియో ప్రజెంటేషన్ ఇచ్చి ఆకట్టుకున్నారు.



కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తున్న డాక్టర్ సేపూరి బాలరవితేజ

18న మహా శివరాత్రి ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈ నెల 18న మహ శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి పేర్కొన్నారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు శనివారం పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం గోపూజ, లలితా సుందరేశ్వర స్వామి వార్లకు పంచామృతాభిషేకం, బిల్వార్చన, సాయంత్రం 5 గంటలకు శ్రీ మామిళ్ల పల్లి జగన్మోహన శర్మ ఆధ్వర్యంలో శ్రీ లలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణం, రథోత్సవం, అర్ధరాత్రి నక్షత్ర ఈవెంట్స్ నరేష్‌చే మ్యాజిక్ షో, మిమిక్రీ ఉంటుందన్నారు. లింగోద్భవకాలంలో 3.12 కోట్ల వత్తితో ఆకాశ శివ మహా జ్యోతి వెలిగించే కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అందరూ పూజల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో లలితా పీఠం సభ్యులు జ్ఞానేశ్వరమ్మ, శ్రావ్యాకార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మెడికవర్‌లో క్యాన్సర్ వైద్యసేవలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): యూరోపియన్ ప్రమాణాల క్యాన్సర్ వైద్యసేవలను త్వరలో కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో ప్రారంభిస్తున్నట్లు హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ త్వరలో మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను కర్నూలు నగరంలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఇకపై క్యాన్సర్ అత్యుత్తమ వైద్యసేవలకు హైదరాబాదు, చెన్నై వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ నీలారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన పెంచాలి

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు మరింత అవగాహన పెంచాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఫాగ్సీ, ఐఎంఏ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలకు ఏవైనా క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లయితే వారు ఆసుపత్రిలోని ఓపీ నెం.14కు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలు ముందుగానే గుర్తిస్తే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో...

రోటరీక్లబ్ గ్రేటర్ కర్నూలు, వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కొండారెడ్డి బురుజు వరకు వాకింగ్ చేస్తూ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు, సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ వాసురెడ్డి మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, నియమిత ఆహారం తీసుకోవడం, వ్యాక్సినేషన్, సకాలంలో వైద్యపరీక్షలు క్యాన్సర్ రిస్క్‌ను తగ్గిస్తాయని చెప్పారు. పొగాకు ఉత్పత్తులు, దూమ, మద్యపానాలకు దూరంగా ఉండాలని సూచించారు.

రైతుబజారులో...

కర్నూలు(అగ్రికల్చర్): మహిళలకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని, అయితే ముందుగా గుర్తించడం ద్వారా పూర్తిగా నివారించుకోవచ్చని కర్నూలు సర్వజన వైద్యశాల గైనిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. శనివారం వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకొని సి.క్యాంపు రైతు బజారులో మహిళా రైతులు, పొదుపు మహిళలు, వినియోగదారులకు మహిళలకు సోకే క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. గైనిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ మాట్లాడారు. సమావేశంలో ఐఎంఏ ప్రతినిధి మాధవీ శ్యామల, డాక్టర్ మమత, రైతుబజారు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు





రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహిస్తున్న దృశ్యం, రైతుబజారులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మాణిక్యరావు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తనిఖీ చేశారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద కొండారెడ్డి బురుజు సమీపంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల గురించి మున్సిపల్ ఎస్ఈ శేషసాయి, ఈఈ షాకీర్ అహమ్మద్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. పనులపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఇంజనీర్లకు సూచించారు.

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం :

నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిషేధిత ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించారు. స్థానిక కల్లూరు ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, పేపర్‌ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునుస్వామి పాల్గొన్నారు.

7న విగ్రహ ప్రతిష్ఠాపన

కర్నూలు కల్చరల్: స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని శ్రీ సత్యసాయి మందిరంలో నూతనంగా నిర్మించిన శ్రీ సాయిశ్వరాలయంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్ కుమార్ తెలిపారు. సపరివార శివ ప్రతిష్ఠ కార్యక్రమాలను పురస్కరించుకొని 7న గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణ ధారణ, 8న మండప పూజలు, ధాన్యాది వాసం, 9న యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠ, బలిదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేడు రామకృష్ణ ఆశ్రమ వార్షికోత్సవం

మిద్దూరు మండలం పైపాలెం గ్రామంలోని శ్రీరామకృష్ణ ఆశ్రమం 31వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణపతి పూజ, రుద్రాభిషేకం, మౌనస్వామి పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వారణాసి శ్రీరామకృష్ణ పీఠం పుణ్యానంద స్వామీజీ మహరాజ్, నందికొట్కూరు అద్వైత బోధాశ్రమం క్రిష్ణవేణమ్మ గురువు, కర్నూలు శ్రీరామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు డాక్టర శరత్ చంద్రలు అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

నేడు ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి రాక

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎంప్లాయీస్ వెల్ఫేర్) చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం కర్నూలుకు రానున్నారని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వి.సి.హెచ్.వెంగళ్‌రెడ్డి తెలిపారు. ఉదయం కర్నూలు స్టేట్ గెస్ట్ హౌస్ చేరుకుంటారని, ఆయనతో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ క్యాలెండర్‌ను విడుదల చేయిస్తామని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఆర్టీసీ 1983 బ్యాచ్ సూపర్‌వైజర్ల సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణ సంస్థ 1983 బ్యాచ్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు కర్నూలు–1, 2 డిపోల రిటైర్డు మేనేజర్లు కేడీఎస్ ప్రసాద్, గద్వాల ఈరన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని రాజ్‌విహార్ సమీపంలో ఉన్న జ్యోతి మాల్ రెండో అంతస్తులోని సమావేశపు హాలులో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తమ బ్యాచ్ అధికారులు హాజరు కానున్నారని, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉన్నవారంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన

కర్నూలు సిటీ: గత నెల 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఇచ్చే ప్రదర్శనలో ఐదుగురు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఆ విద్యార్థులను ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ రమేష్ శనివారం బీక్యాంపులోని తన కార్యాలయ ఆవరణలో శనివారం అభినందించారు.

'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం'

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం నగర కమిటీ కార్యదర్శి టి.రాముడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికలు ఉన్న కర్ణాటకలో వెనుకబడిన ప్రాంతాల పేరిట నిధులను వరదగా మళ్లించారని, నిత్యం కరువు కాటకాలతో అల్లాడిపోతున్న రాయలసీమ గురించి కనీస ప్రస్తావన లేకపోవడం అన్యాయన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలపై దాటవేదయం దారుణమన్నారు. కార్యక్రమంలో నరసింహులు, సాయిబాబా పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కల్లూరు: పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం లక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(మైనార్టీ)లో జరుగుతున్న స్టడీ అవర్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాదేవి ఉన్నారు.